క్లుప్తంగా

అర్హులందరికీ డ్రైవింగ్ లెసెన్స్‌లు



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: అర్హులందరికీ తన సొంత ఖర్చులతో ఉచితంగా టూ వీల్, ఫోర్ వీల్ డ్రైవింగ్ లైసెన్స్‌లతో పాటు హెల్మెట్‌లు అందిస్తామని ఎంపీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం దుబ్బాక పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించి స్వయంగా యువకుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత, ఎంపీపీ పుష్పలత, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్వీ నాయకులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, బీఆర్‌ఎస్ నాయకులు, కౌన్సిలర్లు ఉన్నారు.

విశ్వకర్మలకు ఉచిత కరెంట్ ఇవ్వాలి

హుస్నాబాద్: జిల్లా, మండల, గ్రామీణ ప్రాంతాల్లో కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న విశ్వకర్మలకు ఉచిత కరెంట్ సదుపాయం కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి బుధవారం అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ జిల్లా కన్వీనర్ కొత్తపల్లి సత్యనారాయణ వినతి పత్రం సమర్పించారు. విశ్వకర్మలైన వడ్రంగి, కమ్మరి, కంచరి, శిల్పి, కంసాలి, వెల్డింగ్ వర్క్స్, ఇంజినీరింగ్ వర్క్స్‌పై లక్షలాది మంది వృత్తిదారులు జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు ఉచిత కరెంట్ ఇచ్చినట్లుగా విశ్వకర్మ వృత్తిదారులకు ఉచిత కరెంట్ సదుపాయం కల్పించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘ మండల అధ్యక్షుడు సుదర్శనచారి, నాయకులు శ్రీనివాస్, నాగభూషణచారి, కుమారస్వామి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



ఆస్పత్రిలో బాధితురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

రాయపోలు(దుబ్బాక): మండల కేంద్రమైన దౌల్తాబాద్‌కు చెందిన పబ్బ మాధవి రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. కాగా ఆమెను బుధవారం దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు పరామర్శించి, వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించేలా చూడాలని కోరారు. అదేవిధంగా గొడుగుపల్లికి చెందిన చందా రాములును అడవి పందులు దాడి చేసి గాయపర్చగా బాధితుడిని పరామర్శించారు.

ఘనంగా గోరింటాకు సంబరాలు



గోరింటాకు సంబరాల్లో ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ మాతకు ఆషాడమాసం పురస్కరించుకొని ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు శాకాంబరీమాతగా అలంకరణ చేసి వైభవంగా పూజలు చేశారు. అనంతరం గోరింటాకు సంబరాలను నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి మాంకాల నాగరాణి, జిల్లా అధ్యక్షుడు కాచం నవీన్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ పాండురంగ, సిద్దిపేట సంతోషిమాత ఆలయ అధ్యక్షులు నవీన్, కుకునూరుపల్లి, దౌల్తాబాద్ మండల అధ్యక్షులు శ్రీనివాస్, పద్మ, మహిళా విభాగం సభ్యులు స్రవంతి, రమ్య పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

మద్దూరు(హుస్నాబాద్): ఉమ్మడి మద్దూరు మండలంలో ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హుస్నాబాద్ ఆర్డీఓ బెన్‌షాలోం అన్నారు. బుధవారం మద్దూరు మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న ధరణి పోర్టల్‌లో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావడం లేదన్నారు. క్షేత్రస్థాయిలో ధరణి పోర్టల్ పని తీరుపై తాను ప్రత్యక్షంగా రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం భూ సర్వే చేపట్టి వారంరోజుల వ్యవధిలో నివేదిక సమర్పించాలని సర్వేయర్ దుర్గప్రసాద్‌ను ఆర్డీఓ ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భూపతి, హుస్నాబాద్ డిప్యూటీ తహసీల్దార్ అశోక్, ఆర్‌ఐ రమేశ్ పాల్గొన్నారు.



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మత్తడి పోస్తున్న లింగారెడ్డిపల్లి చెరువు



చేర్యాల(సిద్దిపేట): కమలాయపల్లి సమీపంలో తెగిపోయిన రంగనాయకసాగర్ కాల్వ



మద్దూరు(హుస్నాబాద్): మత్తడి దూకుతున్న దూల్మిట్ట వాగు

జోరు వర్షం.. రైతన్న హర్షం

- జిల్లా వ్యాప్తంగా 1552.2మి.మీ వర్షం
- తొగుటలో అత్యధికంగా 163.2 మి.మీ
- వర్షం రాకతో కర్షకుల్లో ఆనందం



చేర్యాల(సిద్దిపేట): రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న తాడూరు వాగు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వానాకాలం సీజన్ ప్రారంభమై నెలరోజులు కావస్తున్నా కురవాల్సిన భారీ వర్షం మాత్రం ఇప్పటివరకు పడలేదు. దీంతో ముందుగా పడిన కొద్దిపాటి వర్షానికి రైతులు తక్కువ మొత్తంలో పత్తి, మొక్కజొన్న విత్తనాలు విత్తారు. మంగళవారం రాత్రి జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన వర్షం బుధవారం ఉదయం వరకు ఓ మోస్తారు నుంచి భారీగా రూపాంతరం చెందింది. దీంతో ఆందోళనలో ఉన్న రైతుల్లో జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షం సంతోషాన్ని నింపింది. జిల్లా వ్యాప్తంగా 1552.2 మి.మీ వర్షం నమోదైంది. అత్యధికంగా తొగుట మండలంలో 163.2మి.మీ, కొండపాక మండలంలో 130.8మి.మీ, మిరుదొడ్డి మండలంలో 126.మి.మీ, దూళ్మిట్ట మండలంలో 125 మి.మీ, సిద్దిపేట అర్బన్ మండలంలో 116.6మి.మీ, కొమురవెల్లి మండలంలో 110.2 మి.మీ, చేర్యాల మండలంలో 96.4మి.మీ, మద్దూరు మండలంలో 87.4మి.మీ, దుబ్బాక మండలంలో 81మి.మీ, సిద్దిపేట రూరల్ మండలంలో 72.2మి.మీ, అక్బర్‌పేట-భూంపల్లి మండలంలో 62.5 మి.మీ, అక్కన్నపేట మండలంలో 55.4 మి.మీల వర్షపాతం నమోదైంది. దీంతో ఎండిపోయే దశలో ఉన్న పత్తి, మొక్కజొన్నకు ప్రాణం లభించినట్లయింది. జిల్లా వ్యాపంగా కురుసిన వర్షాలతో చతికిలబడిన మొలకలు చిగురిస్తున్నాయి. దీంతో రైతులు తమ పనుల్లో నిమగ్నమయ్యారు. సిద్దిపేట జనగాం ప్రధాన రహదారి తాడూరు వద్ద రోడ్డు ధ్వంసమైంది. దీంతో రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

జిల్లా కేంద్రంలో కురిసిన భారీవర్షంతో పలు శివారు కాలనీల్లో నీరు నిలిచాయి. జిల్లాలోని పలు చెరువులు, కుంటలు నిండుకొని మత్తడి పోస్తున్నాయి.

చేర్యాల(సిద్దిపేట): బుధవారం తెల్లవారుజామున కురిసిన వర్షం మండల పరిధిలో బీభత్సం సృష్టించింది. మండల పరిధిలోని తాడూరు క్రాస్ వద్ద జనగామ సిద్దిపేట ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన డైవర్షన్ తెగిపోయి వాహన రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే తాడూరు గ్రామ శివారులో వాగు నీరు రోడ్డు మీద నుంచి ప్రవహిచడంతో గ్రామం నుంచి రాకపోకలకు అంతరాయం కలిగింది. మండల పరిధిలోని కమలాయపల్లి వగలరాయ చెరువులోకి రంగనాయకసాగర్ నుంచి నీరు వచ్చే కాల్వ చెరువు సమీపంలో గండి పడడంతో సుమారు 40 మంది రైతులకు చెందిన పొలాల్లోకి నీరు చేరింది. చేర్యాల మండలంలోని కమలాయపల్లి గ్రామానికి చెందిన గునిగంటి కనకలక్ష్మి ఇంట్లోకి భారీగా వర్షపు నీరు చేరింది.

అక్కన్నపేట(హుస్నాబాద్): రామవరం నుంచి గండిపల్లి గ్రామానికి వెళ్లే మార్గ మధ్యంలో ఉన్న కల్వర్టుపై వర్షపు నీరు ప్రవాహిస్తోంది. దీంతో రాకపోకలకు కొంతమేరకు ఇబ్బందికరంగా మారింది.

> **పంటలకు మేలు**
>
> 
>
> మంగళవారం కురిసిన వర్షం రైతులకు చాలా మేలు చేస్తుంది. ఇప్పుడు రైతులు తమ పనుల్లో బీజీగా ఉన్నారు. ముఖ్యంగా జిల్లాలో రైతులు అత్యధికంగా పత్తి, మొక్కజొన్నను సాగు చేస్తున్నారు. రబీ కంటే వానాకాలంలో అత్యధికంగా పంటలు సాగవుతాయి. జిల్లాలో అత్యధికంగా వర్షధార పంటలే వేస్తుండడంతో, ఈ వర్షం రైతులకు లబ్ధి చేకూరుస్తుంది. పంటలకు చాలా ఉపయోగపడుతుంది.
>
> –శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి



అక్కన్నపేట(హుస్నాబాద్): రామవరం-గండిపల్లి రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



కొండపాక(గజ్వేల్): సిర్సనగండ్లలోని ఏర చెరువులో భారీగా వస్తున్న వరద నీరు



చెరువును తలపిస్తున్న సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల క్రీడా మైదానం

జీపీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలి



మద్దూరు(హుస్నాబాద్): వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

మద్దూరు(హుస్నాబాద్): గ్రామ పంచాయతీ సిబ్బందిని వెంటనే పర్మనెంట్ చేయాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఆలేటి యాదగిరి అన్నారు. సిబ్బంది వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6న సమ్మె చేపట్టనున్న నేపథ్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డికి సమ్మె నోటీసును అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ మండల నాయకులు మహేందర్, వేణు, శేఖర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ మండల పారిశుధ్య కార్మికులు బుధవారం ఎంపీపీ బాలేషంగౌడ్, ఎంపీడీఓ శ్రీనివాస్‌కు సమ్మె నోటీసును అందించారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మల్లేశం, కార్మికులు పాల్గొన్నారు.

మిరుదొడ్డి(దుబ్బాక): గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మిరుదొడ్డి ఎంపీడీఓ రాజిరెడ్డికి బుధవారం సమ్మె నోటీస్ పత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి మద్దెల అంజయ్య, జేఏసీ నాయకులు సురేందర్, యాదగిరి పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు



మాట్లాడుతున్న నాయకులు

గజ్వేల్: కేసీఆర్ ప్రాతినిధ్యం గజ్వేల్ నియోజకవర్గ దశను మార్చిందని బీఆర్‌ఎస్ మర్కూక్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్‌లోని సీఎం మినీ క్యాంపు కార్యాలయంలో కొండపాక మండల అధ్యక్షులు నూనె కుమార్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఒకప్పుడు కనీస సౌకర్యాలకు దూరంగా ఉన్న గజ్వేల్ నియోజకవర్గం నేడు అన్ని రంగాల్లో అగ్రగామిగా ఆవిర్భవించిందని చెప్పారు. ఈ పరిస్థితి ప్రతిపక్షాలకు మింగుడు పడటం లేదన్నారు. గజ్వేల్‌లో ఉనికిని కోల్పోయామనే భావనతో ప్రభుత్వంపై పనికిరాని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రతిపక్ష నేతలు చౌకబారు విమర్శలు మానుకోకపోతే ప్రజల్లో చులకనవడం ఖాయమన్నారు.

పారిశుధ్య నిర్మూలనకు చర్యలు చేపట్టాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): పారిశుధ్య నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని డీఎల్‌పీఓ వేదావతి అన్నారు. బుధవారం మండల కార్యాలయంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యదర్శులకు స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023లో భాగంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి వాడుకునేలా, ఇంకుడు గుంతలను, తడి, పొడి చెత్త వేరుగా వేసే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ పరిశీలన బృందం వచ్చే వరకు పల్లెలను అందంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేషంగౌడ్, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి,ఎంపీడీఓ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలని వినతి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామ యువకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): క్షవరం చేసే దుకాణంలో దళిత సామాజిక వర్గానికి చెందిన వారికి క్షవరం చేయడం లేదని, తమపై వివక్ష చూపుతున్నారని బుధవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన దళిత సామాజిక వర్గం యువకులు జగదేవ్‌పూర్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రఘువీరారెడ్డికి, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐకి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామ యువకులు మాట్లాడుతూ.. తిమ్మాపూర్ గ్రామంలో దళిత(మాదిగ) సామాజిక వర్గానికి చెందిన వారికి తమ వాడలోనే ఓ చెట్టు కింద కొన్నేళ్లుగా క్షవరం చేస్తున్నారని వివరించారు. మిగతా కులాలకు గ్రామంలో హెయిర్ కటింగ్ దుకాణంలో చేస్తున్నారని తెలిపారు. చెట్టు కింద కాకుండా హెయిర్ కటింగ్ దుకాణంలోనే తమ కులాల వారికి క్షవరం చేయాలని కోరుతూ బుధవారం కొంత మంది యువకులు కలిసి వెళ్తే క్షవరం చేసే నిర్వాహకులు మీకు ఇక్కడ చేయమని, మీ వాడలోనే చెట్టు కింద చేస్తామని, కుర్చీలో కూర్చున్న వ్యక్తికి క్షవరం చేయకుండా దుకాణంలో నుంచి బయటకు వెళ్లినట్లు చెప్పారు. ఎందుకు చేయవని అడిగితే గ్రామ పెద్దలు చేయొద్దని చెప్పారని తెలుపడంతో, తమపై వివక్ష, అవమానం చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాపై వివక్ష, అవమాన పరిచిన వ్యక్తిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్‌కు, ఎస్ఐకి వినతి పత్రం అందించినట్లు తెలిపారు. వారికి మద్దతుగా కుల వివక్ష పోరాట సమితి జిల్లా నాయకులు కృష్ణమూర్తి మద్దతు తెలిపారు.

చెరువుల సుందరీకరణకు ప్రత్యేక చర్యలు



పనులకు శంకుస్థాపన చేస్తున్న అంజిరెడ్డి

ములుగు(గజ్వేల్): చెరువుల పరిరక్షణ, సుందరీకరణ కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని డీసీసీబీ డైరెక్టర్, ములుగు పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి పేర్కొన్నారు. ములుగులో రూ.3కోట్ల వ్యయంతో చేపట్టనున్న కుడుకుంట సుందరీకరణ పనులకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలసి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుందరీకరణ పనులతో ములుగు కుడుకుంట చెరువు పర్యాటక ప్రాంతంగా మారబోతుందన్నారు. గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. కుడుకుంటకు నిధులు మంజూరు చేసిన మంత్రి చంద్రశేఖర్‌రావు, మంత్రి హరీశ్‌రావు, గడా అధికారి ముత్యంరెడ్డిలకు అంజిరెడ్డి గ్రామస్తుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు ప్రవీణ్, హరిబాబు, బీఆర్‌ఎస్ రాష్ట్ర యువజన కార్యదర్శి జుబేర్‌పాషా, నాయకులు మురళీధర్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కిష్టయ్య, శంకర్, నగేశ్, బాలురాజు, మల్లారెడ్డి, కిష్టయ్య, కనకయ్య, శేఖర్, శివరాములు తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం చేపట్టాలి

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని కడవేర్గు శివారులో లోలెవల్ బ్రిడ్జి స్థానంలో వంతెన నిర్మాణానికి రూ.10లక్షల నిధులు మంజూరు చేసి ప్రారంభించిన పనులను వెంటనే చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ కోరారు. బుధవారం వంతెన నిర్మాణం చేపట్టాల్సిన ప్రాంతంలో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ.. మండల కేంద్రం నుంచి కడవేర్గు, పోతిరెడ్డిపల్లి, పెద్దరాజుపేట, నాగపూరి, శభాష్‌గూడెం, కొండపోచమ్మ మీదుగా యాదగిరిగుట్టకు వెళ్లే వాహనదారులకు రహదారిపై కడవేర్గు గ్రామ శివారులో ఉన్న లోలెవల్ బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహం ఇబ్బందికరంగా మారిందన్నారు. సంవత్సరం క్రితం వంతెన పనులు ప్రారంభించినా అధికారులు నేటికీ పూర్తి చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి వెంటనే వంతెన నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కమిటీ సభ్యుడు కత్తుల భాస్కర్‌రెడ్డి, గ్రామస్తులు రాకేశ్, కిరణ్, నరేశ్, సునంద, రమేశ్, మల్లయ్య, సుధాకర్, సురేందర్, శంకర్ పాల్గొన్నారు.

సాదాసీదాగా దౌల్తాబాద్ మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ సంధ్య

రాయపోలు(దుబ్బాక): దౌల్తాబాద్ మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఎంపీపీ గంగాధరి సంధ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను విన్నవించారు. అదేవిధంగా వివిధ శాఖల అధికారులు పనుల ప్రగతిని వివరించారు. కాగా తహసీల్దార్ సుజాతపై కోనాపూర్ సర్పంచ్ పంచమి స్వామి మండల సభలో ఫిర్యాదు చేశారు. గ్రామంలో నిర్మించిన 20 డబుల్ ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించినా ఇప్పటికీ వారిని ఇళ్లలోకి వెళ్లేందుకు అనుమతించడం లేదని, కొంతమంది మాటలు వింటూ తహసీల్దార్ నిర్లక్ష్యం వహిస్తున్నారని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీని కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రణం జ్యోతి, ఎంపీడీఓ రాజేశ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు రహీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల మృతి చెందిన గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ మృతికి సంతాపం ప్రకటించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కోట్లు వెచ్చించినా.. వసతులు సున్నా



మోకాలి లోతు నీటిలో నుంచి మూత్రశాలలకు వెళ్తున్న విద్యార్థులు

దుబ్బాక: సీఎం కేసీఆర్ చదువుకున్న పాఠశాలను రూ.10కోట్లు ఖర్చు పెట్టి ఆగమేఘాలపై పునర్నిర్మించి అధికారులు చేతులు దులుపుకున్నారు. దీంతో పాఠశాల ఆవరణ చిన్న వానకే జలమయం కావడంతో విద్యార్థులు మూత్రశాలలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బంది పడాల్సిన దుస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో మోకాలి లోతు నీటిలో నుంచే విద్యార్థులు మూత్రశాలలకు వెళ్తూ ఇబ్బంది పడుతున్నారు. పాఠశాల నిర్మాణానికి కోట్లు వెచ్చించిన అధికారులు చిన్న సదుపాయాలను కల్పించడంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీటిలో విద్యార్థులు జారి పడితే వారి పరిస్థితి ఏమిటని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

హుస్నాబాద్: హైదరాబాద్‌లో ఈ నెల 8, 9, 10వ తేదీలలో నిర్వహించే ఏఐవైఎఫ్ జాతీయస్థాయి వర్క్‌షాపు వాల్‌పోస్టర్‌ను బుధవారం పట్టణంలోని అనభేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో ఏఐవైఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రాయికుంట మంజుల, బోయిని సంపత్, తొందూరి రంజిత్, మణిదీప్, అజయ్, సాయిచరణ్ పాల్గొన్నారు.

◆ ఆర్థికసాయం

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో నివాసం ఉంటున్న మద్దూరు మండలం సలాక్‌పూర్‌కు చెందిన వగలబోయిన రక్షిత్(19) ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా బుధవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన కిరాణ వర్తక సంఘం అధ్యక్షుడు శేరి బాలనారాయణ, మరో వ్యాపారి పడకంటి ఉమాకాంత్‌లు పలువురు దాతల ద్వారా సేకరించిన రూ.61,563లను మృతుడి తల్లికి అందజేశారు. వారి వెంట పెద్ది అంజయ్య, గణేశ్ తివారి, మైక్ యాదగిరి, సింగరబోయిన రాజు ఉన్నారు.

◆ ముమ్మరంగా పారిశుధ్య పనులు

మిరుదొడ్డి(దుబ్బాక): బుధవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి మిరుదొడ్డి మండల కేంద్రంలో మురికి కాల్వలు నిండిపోయి రోడ్డుపై వరద ప్రవహించింది. దీంతో పలు రోడ్లు బురదమయంగా మారాయి. పారిశుధ్య కార్మికులు ముమ్మరంగా పారిశుధ్య పనులు నిర్వహించారు. మురికి కాల్వల్లో ఇరుక్కు పోయిన ప్లాస్టిక్ వస్తువులతో పాటు మట్టిని తొలగించి నీరు నిల్వకుండా చేశారు. పారిశుధ్య పనులను సర్పంచ్ రాములు పర్యవేక్షించారు.

◆ పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలి

కొమురవెల్లి(సిద్దిపేట): అర్హులందరికీ ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సనాది భాస్కర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం గృహలక్ష్మి పథకంలో ఇంటి స్థలం లేని నిరుపేదలకు స్థలంతో పాటు నిర్మాణాన్ని చేపట్టి ఇవ్వాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ దాసరి కళావతి, మండల కార్యదర్శి సత్తిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ ఫీజులు అరికట్టడంలో అధికారులు విఫలం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో నిబంధనలకు విరుద్ధంగా ఫీజుల దోపిడీ చేస్తున్న అరికట్టడంలో విద్యాశాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఏఐపీఎస్‌యూ జిల్లా కన్వీనర్ ఒగ్గు రమేశ్ అన్నారు. బుధవారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఒగ్గు రమేశ్ మాట్లాడుతూ.. యూనిఫాం, టెస్ట్‌బుక్స్, స్పోర్ట్స్ డ్రెస్ అని వివిధ రూపాల్లో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూల్ చేస్తున్నారన్నారు. ప్రైవేట్ పాఠశాల బస్సులకు ఫిట్నెస్ లేకుండా నడిపిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు పాఠశాలల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాన్నారు. కార్యక్రమంలో రాజు, శివ, రవి, శేఖర్ పాల్గొన్నారు.

◆ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను నియంత్రించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కమిటీ నాయకులు అన్నారు. ఈ మేరకు బుధవారం డీఈఓ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఇప్పటికైనా డీఈవో స్పందించి ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలపై పర్యవేక్షణ జరిపించి, ప్రభుత్వ నిబంధనలు పాటించని, అనుమతిలేని స్కూల్‌ల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

◆ డంప్‌యార్డు, శ్మశానవాటిక తిరిగి నిర్మించాలి

తొగుట(దుబ్బాక): కూల్చివేసిన డంప్‌యార్డు, శ్మశానవాటికను తిరిగి నిర్మించాలని దుబ్బాక కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. తుక్కాపూర్ గ్రామస్తులు చేపట్టిన ఆందోళనకు బుధవారం ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో డంప్‌యార్డు, శ్మశానవాటిక నిర్మించాలంటూ అప్పటి జిల్లా కలెక్టర్ సర్పంచ్‌లపై తీవ్ర ఒత్తిడి చేసిన విషయం తెలియదా అని అధికారులను ప్రశ్నించారు. అనుమతి లేకుండా నిర్మించారని అనడం అధికారుల అవివేకానికి నిదర్శనమన్నారు. సమస్య పరిష్కరించకుంటే మెదక్ ఎంపీ ఇంటి ఎదుట చెత్త వేయాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రం, ఉపసర్పంచ్ శ్రీలత, మాజీ సర్పంచ్ విజయ్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ 'నిధుల మంజూరులో వివక్ష సరికాదు'

కోహెడ(హుస్నాబాద్): మండలంలోని పది గ్రామాల బీఆర్‌ఎస్‌కు చెందిన ఎంపీటీసీలకు రూ.10లక్షలు చొప్పున నిధులు మంజూరు చేయడం సరికాదని బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలో 13 మంది ఎంపీటీసీలు ఉన్నారని, ఇందులో మూడు గ్రామాలకు చెందిన ఎంపీటీసీలకు సీసీరోడ్ల నిర్మాణాలకు నిధులు ఇవ్వలేదన్నారు. నిధులు మంజూరులో మంత్రి వివక్ష చూపడం శోచనీయమన్నారు. మిగతా మూడు గ్రామాల ఎంపీటీసీలకు సైతం నిధులు మంజూరు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కోహెడ ఎంపీటీసీ సభ్యురాలు స్వరూప ఉన్నారు.

◆ మహిళల రక్షణకు షీటీమ్స్

చిన్నకోడూరు(సిద్దిపేట): మహిళలు, విద్యార్థుల భద్రత, రక్షణ కోసం షీ టీమ్స్ పని చేస్తున్నాయని సిద్దిపేట మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఇబ్రహీం నగర్ మోడల్ స్కూల్‌లో సైబర్ నేరాలపై, మహిళల రక్షణ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, షీటీమ్ సిబ్బంది ఉన్నారు.

◆ రిజిస్ట్రేషన్‌లు చేయడంలో నిర్లక్ష్యం

మర్కూక్(గజ్వేల్): మర్కూక్ మండల తహసీల్దార్ కార్యాలయంలో భూముల రిజిస్ట్రేషన్‌లు చేయడంలో తహసీల్దార్ నిర్లక్ష్యం వహిస్తుందని ములుగు ఆత్మ కమిటీ డైరెక్టర్ జుర్రు ఐలంయాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. పదిరోజులు క్రితం మర్కూక్‌లోని భూమి రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకున్నామని తెలిపారు. తహసీల్దార్ భాగ్యరేఖ రిజిస్ట్రేషన్ చేయకుండా ఆలస్యం చేస్తుందని తెలిపారు. అడిగితే మాకు పని ఉంది రేపుమాపు అంటూ కాలయాపన చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల పట్ల నిర్లక్ష్యంగా వహిస్తున్న తహసీల్దార్‌పై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.